# దేవుడున్నాడు

**నా** మిత్రుడికి భగవంతుడిలో విశ్వాసం జాస్తి. ఎందుచేతనంటే భగవంతుడు నా మిత్రుణ్ని కనిపెట్టుకునే ఉన్నాడు.

పృథ్విలో ఇతర మానవమాత్రులు తమ అవివేకం వల్ల కష్టాలపాలవుతారు, మోసం వల్ల పైకి వస్తుంటారు. నా మిత్రుడి విషయంలో అట్లాకాదు – అతను పూర్వకాలపు మహా భక్తుల సంతతివాడు; అతనికి కష్టాలు కలిగినప్పుడల్లా అది భగవంతుడి పరీక్ష. సుఖాలు కలిగినప్పుడల్లా భగవంతుడి అనుగ్రహం.

బ్రహ్మాండంలో భగవంతుడు కనిపెట్టి ఉండవలిసినదెంతో ఉంది. సూర్య చంద్రులున్నారు, నక్షత్రాలున్నై, అండాండాలున్నై, పిండాండాలున్నై, కాని వీటన్నిటినీ ఒక ఎత్తుగానూ నా మిత్రుణ్ని ఒక ఎత్తుగానూ చూస్తాడు భగవంతుడు.

గ్రహాలు కూడా నా మిత్రుణ్ని కనిపెట్టే ఉన్నై.

తెలీనివాళ్లు నా మిత్రుణ్ని, ఆ పని ఎందుకు చేశావు, ఈ పని ఎందుకు చేశావు అని తప్పు పడతారు. పిచ్చివాళ్లు! గ్రహాలు అతనిచేత ఆయా పనులు చేయిస్తూ ఉంటై. నా మిత్రుడు నిమిత్తమాత్రుడు....

ఒకరోజు నా మిత్రుడి పర్సు కాస్తా ఎవరో కాజేశారు. కుజదశలో శన్యంతరంలో దొంగవాడి అవాంతరం కలిగింది నా మిత్రుడికి.

"చూశావుటోయ్, ఎంత పని జరిగిందో? పొద్దున్నే లేచి ఎవడి మొహం చూశానో. నా పర్సు కొట్టేశారు" అన్నాడు నా మిత్రుడు.

పొద్దున్నే కనిపించే మొహాలు కూడా నా మిత్రుణ్ని కనిపెట్టి ఉంటాయన్నమాట.

"నువ్వన్నట్టు భగవంతుడున్నాడోయ్, ఈ పూట నిన్ను మరిచిపోయి, ఆ దొంగవాణ్ని కనిపెట్టి ఉన్నాడు విచారించకు" అన్నాను నా అమూల్య మిత్రుడితో.

***ముద్రణ : ఆనందవాణి, 27 జూలై 1947***